క్లుప్తంగా

106 మందికి వైద్యపరీక్షలు



రావిరాల(జగ్గయ్యపేట):ప్రజలు కంటి జాగ్రత్తలు తీసుకోవాలని రామ్‌కో వైద్యుడు రాజా కేశవ ప్రసాద్ సూచించారు. రామ్‌కో కర్మాగారం ఆధ్వర్యంలో రావిరాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 106మంది గ్రామస్తులకు కంటి వైద్యపరీక్షలు చేసి మందులు, అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ డీజీఎం రామకృష్ణ సాయి, నరసింహరాజు, గ్రామ కార్యదర్శి ఇమాం, రామ్‌కో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం



పెనుగంచిప్రోలు: విద్యార్థులకు ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్ సూచించారు. స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్ వద్ద గురువారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. ఈవ్‌టీజింగ్ పాల్పడేవారి సమాచారాన్ని తమకు తెలియజేయాలని సూచించారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని వివరించారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒత్తిడి లేని విద్య



శనగపాడు(పెనుగంచిప్రోలు):అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడి లేని విద్య అందుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి అన్నారు. శనగపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. పెరటి తోటల పెంపకం, ప్రీస్కూల్ కార్యక్రమాలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు విద్యతోపాటు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలన్నారు. బిడ్డ పుట్టగానే బర్త్ సర్టిఫికెట్‌తోపాటు ఆధార్ కార్డు కూడా తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సీత, దుర్గ భారతి పాల్గొన్నారు.

పశుసంపద అభివృద్ధికి చర్యలు



వెంకటాపురం(పెనుగంచిప్రోలు):మండలంలోని వెంకటాపురంలో గురువారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మార్కపూడి గాంధీ మాట్లాడుతూ పశుసంపద వృద్ధికి కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పశువైద్యాధికారులు పి. అర్చన, అనిల్ మాట్లాడుతూ పశువులకు చూడు పరీక్షలు, జీవాలు, దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పశుపోషణలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్రామసర్పంచ్ నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయించాలని కోరుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మాణ ఉత్సవ కమిటీ, హిందూచైతన్య వేదిక సభ్యులు గురువారం జగ్గయపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను కలిసి వినతిపత్రం అందజేశారు. విజయవాడ రోడ్డు తొర్రగుంటపాలెం కూడలి వద్ద విగ్రహం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నకిరికంటి నాగేశ్వరరావు, వేద కుమార్, కోర్ కమిటీ సభ్యులు పబ్బతి నరేంద్ర, సంకా భాస్కర్, అల్లి రవిచంద్, అశోక్, ఉత్సవ కమిటీ సభ్యులు కాటగాని నరసింహారావు, విష్ణు, చంద్రశేఖర్, దేవరశెట్టి నాగరాజు, కన్నోజు కేశవ, తరుణ్, సుబ్బరాజు, గోపి, వెంకట్ ఉన్నారు.

ఆలయానికి ఆదాయం-భక్తులపై భారం

- వివాదాస్పదంగా మారుతున్న కాంట్రాక్టర్ల వసూళ్లు
- దేవదాయశాఖ నిబంధనలకు తూట్లు
- ఇష్టారాజ్యంగా భక్తుల నుంచి అధిక వసూళ్లు



శ్రీతిరుపతమ్మవారి దేవస్థానం

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులను ఆలయం వద్ద ఆయా కాంట్రాక్టు హక్కులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిలువుదోపిడీ చేస్తున్నారు. వాహనం పార్కింగ్ నుంచి పూజసామగ్రి కొనుగోలు, పొంగలి పెట్టడం, అద్దెగదులు తదితర వసతి పొందేవారి నుంచి దేవదాయశాఖ విధించిన రుసుం కంటే అధికమొత్తాన్ని వసూలు చేస్తూ భక్తుల జేబులకు చిల్లుపెడుతున్నారు. అదేమని ప్రశ్నిస్తే బహిరంగ వేలంలో ఆయా హక్కులను హెచ్చుధరకు దక్కించుకున్నామంటూ అధిక ధరలు తప్పవంటూ పలువురు కాంట్రాక్టర్లు భక్తులపై కస్సుబుస్సులాడుతుండటం ఇక్కడ నిత్యకృత్యం.

ఆలయానికి పెరిగిన ఆదాయం..

పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద ఏటా ఏప్రిల్ ఒకటోతేదీ నుంచి మార్చి 31వతేదీ వరకు పలు వ్యాపారాల నిర్వహణకు సంబంధించి ఆలయ అధికారులు ఏటా బహిరంగ వేలంపాటలు నిర్వహిస్తారు. ఇలా 22రకాల హక్కులకు ఏటా జనవరిలో వేలంపాటలు పూర్తవుతాయి. 2025 ఏప్రిల్ 1వతేదీ నుంచి 2026 మార్చి 31వతేదీ వరకు పదిరకాల వ్యాపారాలకు సంబంధించిన వేలంపాటలు ఈనెల 20న పూర్తయ్యాయి. ఈవేలం ద్వారా ఆలయానికి రూ.2.31కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది కంటే రూ.46.81లక్షల ఆదాయం పెరిగింది. ఇంకా ప్రధానమైన పొంగలి షెడ్ల నిర్వహణ, భక్తులు సమర్పించు కేశాలు ప్రోగు చేసుకునే హక్కు, కొబ్బరికాయల విక్రయానికి సంబంధించి వేలంపాటలు జరగాల్సి ఉంది.

వసూళ్లకే ప్రాధాన్యం...

వేలంలో ఆయా హక్కులు పొందిన కాంట్రాక్టర్లు ఆలయానికి వచ్చే భక్తుల నుంచి అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆలయం వద్ద వాహనాల పార్కింగ్‌కు టూవీలర్‌కి రూ.10, ఆటో రూ.30, నాలుగు చక్రాల వాహనాలకు 40, ఆరు చక్రాల వాహనాలకు రూ.120, భారీ వాహనాలకు రూ.150 వసూలు చేయాల్సి అదనంగా మరో రూ.పది వసూలు చేస్తున్నారు. ఉత్సవాలు, తిరునాళ్ల సమయాల్లో పార్కింగ్ ఫీజులు మరింత అధికంగా వసూలు చేస్తున్నారు. గోవులకు పచ్చగడ్డి కట్ట రూ.10, తవుడు, బెల్లం మిశ్రమం మొత్తం 500 గ్రాములకు రూ.40 వసూలు చేయాల్సి ఉండగా అదనంగా మరో రూ.10 కలిపి రూ.50 వసూలు చేస్తుండటం గమనార్హం. కొబ్బరికాయ ఒకటి రూ.40, పూజా సామగ్రితో కలిపి రూ.50లకు విక్రయించాల్సి ఉండగా భక్తుల నుంచి అదనంగా రూ.20 వసూలు చేస్తున్నారు. పొంగలి షెడ్డులో పావుకిలో పొంగలి పెట్టుకునేందుకు రూ.70, అరకిలో రూ.90, కిలో రూ.120 మాత్రమే వసూలు చేయాలని దేవదాయశాఖ నిబంధన విధించగా ఇక్కడ మరో రూ.30 అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. సత్రాల్లో బెడ్‌లేని గదులకు రోజుకు రూ.500, సింగిల్ బెడ్ రూ.600, డబుల్‌బెడ్ రూ.800, కార్నర్ గదులు రూ.800, ఏసీ గదులు రూ.1500 వసూలు చేయాల్సి ఉన్నప్పటికీ ఇక్కడ రూ.100 నుంచి రూ.200 అధికంగా వసూలు చేస్తున్నారు. ఇక సెలవుదినాలు, పండుగలు, కల్యాణోత్సవాలు, తిరునాళ్ల సందర్భాల్లో ఈ వసూళ్లు మరింత అధికంగా ఉంటున్నాయని భక్తులు గగ్గోలుపెడుతున్నారు. పర్యవేక్షించాల్సిన దేవదాయశాఖ పాలకవర్గం, అధికారులు సైతం ఏమాత్రం పట్టించుకోకపోతుండటంతో కాంట్రాక్టర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధిక ధరలపై ప్రశ్నిస్తే ఆయా ప్రాంతాల్లో ధరల సూచికల బోర్డుల ఏర్పాటు పేరుతో ఆలయ అధికారుల హడావుడి మినహా భక్తులకు ఒనగూరే ప్రయోజనమేమి లేకపోతుండటం గమనార్హం. ఇకనైనా పాలకవర్గం, ఆలయ అధికారులు స్పందించి ఆయా కాంట్రాక్టర్లు భక్తుల నుంచి అధికవసూళ్లకు పాల్పడకుండా తగిన పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధిక ధరల వసూళ్లపై కఠినంగా వ్యవహరిస్తాం

ఆలయం వద్ద వ్యాపాలు నిర్వహించే చోట ధరల పట్టికలు ఏర్పాటు చేశాం. కాంట్రాక్టర్లు దేవదాయశాఖ నియమ నిబంధనల ప్రకారం వ్యాపారాలు నిర్వహించాలి. భక్తుల నుంచి అధిక ధరలు వసూలు చేసే కాంట్రాక్టర్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. భక్తుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా నిబంధనల మేరకు రుసుం వసూలు చేసేలా చర్యలు తీసుకుంటా.

– బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, ఆలయ ఈవో

మెడికల్ షాపుల్లో తనిఖీలు



కంచికచర్ల : మెడికల్ షాపుల్లో ఫార్మాసిస్ట్ సర్టిఫికెట్‌తోపాటు తప్పనిసరిగా ఫార్మసిస్ట్ కూడా అందుబాటులో ఉండాలని తహసీల్దార్ పి.జాహ్నవి ఆదేశించారు. కంచికచర్లలోని చెవిటికల్లు సెంటర్, మండల పరిషత్ కార్యాలయం కాంప్లెక్స్, గొట్టుముక్కల రోడ్డులోని మెడికల్ షాపులను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ మేరకే మందులను విక్రయించాలని స్పష్టం చేశారు. కాలం చెల్లిన మందులను విక్రయించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్ఐ వెంకట్, డీటీ మానస, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1 నుంచి బ్యూటీషియన్, టైలరింగ్‌లో శిక్షణ ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు):రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి బ్యూటిషియన్, టైలరింగ్‌లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 7382193413, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గుడిమెట్లలో సీసీరోడ్లు ప్రారంభం



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి, విప్ సౌమ్య

చందర్లపాడు(నందిగామటౌన్): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాలశాఖా మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. చందర్లపాడు మండలం గుడిమెట్లలో రూ.51లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ ఏడునెలల పాలనలోనే గ్రామాలు అభివృద్ధి దిశగా అడుగువేస్తున్నాయని తెలిపారు. చంద్రబాబు పాలనాతీరును గమనిస్తున్న దేశ, విదేశాల పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో విధ్వంస పాలన సాగిస్తే సీఎం చంద్రబాబు మాత్రం ముందుచూపుతో పాలన సాగిస్తున్నారని వివరించారు. ఈ నెలాఖరులోగా నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కోట వీరబాబు, వాసిరెడ్డి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిర్చితోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఉద్యానవనశాఖ అధికారి వర్ధిని



మిర్చిపంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారి వర్ధిని

జగ్గయ్యపేట: మిరప పంటలో వడలు తెగులు అధికంగా ఉందని జగ్గయ్యపేట ఉద్యానవనశాఖాధికారి వర్ధిని తెలిపారు. జగ్గయ్యపేట మండంలోని తక్కెళ్లపాడు, బూదవాడ, రామచంద్రునిపేట గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించి మిర్చి తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వడతెగులు నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ 3గ్రాములు లీటరు నీటిలో కలిపి వేరు మండలం తడిసేలా పోసుకోవాలన్నారు. మిర్చి కోత అనంతరం నత్రజని ఎరువులు అధికంగా వాడవద్దని సూచించారు. నీటి తడులు కూడా అధికంగా ఇవ్వరాదన్నారు. తెగులు సోకిన భాగానికి, ఆరోగ్యంగా ఉన్న పంటకు విడివిడిగా నీటి తడులు అందించాలని ఆమె సూచించారు. పంటమార్పిడి పాటించకపోవడమే ఇటువంటి తెగుళ్లకు ప్రధాన కారణమని, రైతులు తప్పకుండా పంట మార్పిడి చేపట్టాలని కోరారు. పంటమార్పిడిలో భాగంగా పప్పుధాన్యాలు లేదా తృణధాన్యాలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు.

సోలార్ ఏర్పాటుతో విద్యుత్‌పై ఖర్చు ఆదా



చిల్లకల్లులో మాట్లాడుతున్న మండల అభివృద్ధి అధికారి నితిన్



వెంకటాపురంలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ గాంధీ, సచివాలయ సిబ్బంది



పరిటాలలో ర్యాలీచేస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ జాహ్నవి, ఏఈ దిబ్బయ్య తదితరులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఇళ్లకు అయ్యే విద్యుత్ ఖర్చును తగ్గించుకోవచ్చని ఎంపీడీవో నితిన్ సూచించారు. పీఎం సూర్యఘర్ పథకంపై గురువారం చిల్లకల్లులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకునేవారికి బ్యాంకు రుణం మంజూరుతోపాటు సబ్సిడీ కూడా ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ర్యాలీలో ఇన్‌చార్జి తహసీల్దార్ పెద్ది మనోహర్, ఏపీఎం రామకృష్ణ, అన్ని గ్రామాల కార్యదర్శులు, సచివాలయ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

వెంకటాపురం(పెనుగంచిప్రోలు):పీఎం సూర్యఘర్ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ సూచించారు. వెంకటాపురంలో సూర్యఘర్ పథకంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మూడు కిలోవాట్ల మేర సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్రప్రభుత్వం 40శాతం వరకు సబ్సిడీని అందజేస్తోందని వివరించారు. ర్యాలీలో సర్పంచ్ కూచి నర్సయ్య, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

పరిటాల(కంచికచర్ల): ప్రజలు తమ నివాస గృహాలపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు వీలుగా కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, తహసీల్దార్ పి.జాహ్నవి సూచించారు. పీఎం సూర్యఘర్ పథకంపై పరిటాలలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ పథకం కింద అందించే సబ్సిడీలను గ్రామస్తులకు వివరించారు. ర్యాలీలో విద్యుత్‌శాఖ ఏఈ దిబ్బయ్య, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుధా మధురం గాన సమ్మోహనం



విజయవాడ కల్చరల్: హంసధ్వని చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో పటమట దత్తపీఠంలోని మరకత రాజరాజేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీత ఉత్సవాలు గురువారం ముగిసాయి. రాంపల్లి గోపీ కృష్ణ త్యాగరాజ స్వామి సంగీత సాహిత్యంలో భక్తి అంశంగా ప్రసంగించారు. చివరిగా టాప్ గ్రేడ్ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ మధురంగా సాగింది. నాదం శంకరం, భోభిల్లు సప్తస్వర, త్యాగరాజ స్వామి రచించిన పలు కీర్తనలు మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవాని, ఘటంపై హరిబాబు, మృదంగంపై ఎన్ఎస్ కల్యాణరామన్ సహకరించారు. హంసధ్వని చారిటబుల్ సంస్థ వ్యవస్థాపక సంఘం సభ్యుడు యనమండ్ర శ్రీనివాస శాస్త్రి, కళాకారులను సత్కరించారు. సంస్థ సభ్యులు రామశాస్త్రి, గోపీ కృష్ణశర్మ పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్‌చంద్రబోస్ జయంతి



పేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేతాజీకి నివాళులర్పిస్తున్న వట్టెం మనోహర్, నాయకులు



నేతాజీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నాయకులు



చిల్లకల్లులో నివాళులర్పిస్తున్న ఏఎస్ఐ, ప్రజలు

నందిగామటౌన్: జై జవాన్.. జైకిసాన్ నినాదంతో స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అందించిన సేవలు మరువలేనివని సీనియర్ న్యాయవాది సుంకర సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. నేతాజీ సేవాదళ్ ఆధ్వర్యంలో ఆజాద్ హిందు ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం సేవాదళ్ ఆధ్వర్యంలో పలువురిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు, కోవెలమూడి వెంకటేశ్వరరావు, సేవాదళ్ అధ్యక్షుడు పూజారి రాజేష్, వందేమాతరం అశోక్, సత్యనారాయణ, తాటి రామకృష్ణ, దివి కృష్ణమాచార్యులు, షేక్ ఖాజా, అనుమల కృష్ణ, అత్యం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని చిల్లకల్లులో అంజనా యూత్ ఆధ్వర్యంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు నేతాజీ చిత్ర పటానికి ఏఎస్ఐ మంగ్యానాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుభాష్‌చంద్రబోస్ త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు మల్లికార్జునరాజు, హెడ్‌కానిస్టేబుల్ దాసు, సభ్యులు ఏడుకొండలు, లాజరు తదితరులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

మక్కపేట(వత్సవాయి): నేటి యువతరానికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తి అని జిల్లా ప్రైవేటు పాఠశాలల ప్రధానకార్యదర్శి కొమరగిరి రవీంద్రభరద్వాజ్ పేర్కొన్నారు. శ్రీసాయిసెంచరీ హైస్కూల్‌లో నేతాజీ జయంతి నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ కె. సవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో...

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి ఆ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మనోహర్ మాట్లాడుతూ నేతాజీ ఉద్యమ స్ఫూర్తిని, ఆయన చూపిన దేశభక్తిని కొనియాడారు. జగ్గయ్యపేటలో సుభాస్‌చంద్రబోస్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, సీనియర్ నాయకులు బద్దూనాయక్, కన్నమాల శామ్యూల్, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు పింగళి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు, నాయకులు గోగుల వెంకయ్య, గంగోలు వినోద్, రామిని ఉపేందర్‌రెడ్డి, గొట్టిపాళ్ల సురేష్, బండి రాజు, మురళి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాసంలో..

జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) నివాసలంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి ఎమ్మెల్యే తాతయ్య, టీడీపీ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశస్వాతంత్ర్యం కోసం నేతాజీ చేసిన సేవలు అమూల్యమైనవని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్ గొట్టె నాగరాజు, యానాల గోపీచంద్, కాశి నీడి బుజ్జిబాబు, గుమ్మ వెంకటేష్ పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక జనసేన కార్యాలయంలో ఆపార్టీ నాయకులు నేతాజీ జయంతిని నిర్వహించి, ఆయనకు నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ కొలగాని రాము, షేక్ సత్తార్, కాశి కిషోర్, కఠారి హరిబాబు, ఈమని కిషోర్ పాల్గొన్నారు.

వీఎస్‌పీ టౌన్‌షిప్‌లో....

పట్టణశివారులోని విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో సుభాష్‌చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. నేతాజీ పార్కు కమిటీ ఆధ్వర్యంలో సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేఎల్‌ఎం యూనిట్ ఇన్‌చార్జ్ నాగరాజు మాట్లాడుతూ నేతాజీ అందించిన ఉద్యమ స్ఫూర్తిని, దేశభక్తిని కొనియాడారు. నేతాజీ పార్కు కమిటీ అధ్యక్షుడు మన్నె శ్రీనివాసరావు, రామచందర్‌నాయక్, కేవీటీచంద్రశేఖర్, శ్రావణ్‌కుమార్, రామకృష్ణ, రామ తులశమ్మ, గోపికృష్ణ, వర్మ, కోటేశ్వరరావు, వలిబాబు, సన్యాసిరావు, హేమనాయక్, కార్మికసంఘాల నాయకులు పాల్గొన్నారు.



నందిగామలో నేతాజీకి నివాళులర్పిస్తున్న కమిషనర్ రమణబాబు, ఎస్ఐ తదితరులు



మక్కపేటలో సుభాష్‌చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న భరద్వాజ్, సవిత, విద్యార్థులు



వీఎస్‌పీ టౌన్‌షిప్‌లో నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాగరాజు, ఉద్యోగులు

హుండీ ఆదాయం రూ. 83వేలు

నందిగామటౌన్:దాములూరు కూడలిలో వేంచేసియున్న పర్వతవర్ధిని సమేత సంగమేశ్వర స్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ ద్వారా రూ.83,305 ఆదాయం వచ్చిందని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. ఆలయంలో గురువారం హుండీని లెక్కించారు. పది నెలలకుగాను రూ.83వేలు ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, గ్రామ నాయకుడు గింజుపల్లి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు, దుర్గాశివసాయి సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

నందిగామటౌన్: స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రుబాబు విద్యాసాగర్, కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అరిగెల శివరామ్ ప్రసాద్, న్యాయవాదులు నంద్రు శ్రీరామ్మూర్తి, గోబెరు శివరామకృష్ణ, చాట్రగడ్డ రవికుమార్, జోహార్, సురేష్, పదాకుల కృష్ణప్రసాద్, కొమ్మినేని మౌలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థినికి బహుమతి



దుర్గాభవానీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):మహాకవి గురజాడ అప్పారావు 109వ వర్ధంతి సందర్భంగా గత ఏడాది అక్టోబర్‌లో కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, క్లస్టర్ విశ్వవిద్యాలయం, గురజాడ ఫౌండేషన్, ప్రకాశిక అంతర్జాల ప్రతిక సంయుక్తంగా గురజాడ భావ స్ఫూర్తి అనే అంశంపై నిర్వహించిన జాతీయస్థాయి వ్యాసరచన పోటీల్లో తమ కళాశాలలో బీసీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న బి.దుర్గాభవానీ ప్రతిభ చూపిన నగదు బహుమతి గెలుపొందిందని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. పోటీల విజేతల వివరాలను బుధవారం ప్రకటించి, నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందచేశారన్నారు. ప్రతిభ చూపిన దుర్గాభవానిని కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాలతో పాటుగా అధ్యాపకులు కళాశాల ఆవరణలో గురువారం అభినందించారు.